


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, జూన్ 19, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





## ప్రపంచ దేశాలకు ఇరాన్ బంపర్ ఆఫర్.. 'హర్మూజ్'లో 60 రోజుల పాటు ఉచిత ప్రయాణం!

- ఒప్పందం ప్రకారం 'హర్మూజ్'లో రవాణా రుసుములను రద్దు చేసిన ఇరాన్
- రాబోయే 60 రోజుల పాటు అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఉచిత ప్రయాణం
- ఇరాన్ ఓడరేవులపై నౌకాదళ దిగ్బంధనాన్ని అధికారికంగా తొలగించిన అమెరికా
- పర్షియన్ గల్ఫ్ జలసంధి అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి

## 24 వరకు తెలంగాణలో వడగాల్పులు.. ఆ వెంటనే భారీ వర్షాలు కురిసే అవకాశం!



- మరో 4,5 రోజుల్లో తెలంగాణ, తూర్పు రాష్ట్రాల్లోకి నైరుతి రుతుపవనాల విస్తరణ
- ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఆలస్యమైన వర్షాల రాక
- మొత్తం 741 జిల్లాలలో 400కి పైగా జిల్లాల్లో నమోదైన వర్షపాత లోటు
- జూన్ 24 వరకు ఉత్తరప్రదేశ్, విదర్భ, తెలంగాణలో కొనసాగనున్న వడగాల్పుల తీవ్రత
- వచ్చే వారం నుంచి వర్షాలు పుంజుకుని ఖరీఫ్ సాగుకు ఊతం

## రికార్డు ధర పలికిన హైదరాబాద్ భూములపై న్యాయ వివాదం.. ఎస్బీఐ పిటిషన్‌తో వేలానికి బ్రేక్



- రాయదుర్గం భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు స్టే
- భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- మే 28న ఎకరానికి 237 కోట్ల రికార్డు ధర పలికిన భూమి
- టీజీఐఐసీ, గౌరా వెంచర్స్‌కు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు



# అభివృద్ధిపై రాజీలేదు: సీఎం రేవంత్

### ఆక్రమణదారులపై హైడ్రా ఉక్కుపాదం .. మూసీ ప్రక్షాళనను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేస్తాం

### ఫ్యూచర్ సిటీ నిర్మాణమే భవిష్యత్ తెలంగాణ లక్ష్యం.. కాలుష్య రహిత నగర నిర్మాణానికి సంకల్పం

### గుర్రంగూడలో వనమహోత్సవం--2026 ఘన ప్రారంభం.. అర్బన్ పార్కులు, పర్యావరణ ప్రాజెక్టులకు శ్రీకారం

గుర్రంగూడ: రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో జరిగిన వనమహోత్సవం--2026 కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఆక్రమణలపై ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. వేలాది మంది ప్రజలు జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తులు వరదల వల్ల నష్టపోతున్న పరిస్థితులకు ప్రధాన కారణం ఆక్రమణలేనని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కబ్జా చేస్తే ప్రకృతి తిరిగి మనుషుల నివాస ప్రాంతాలను ఆక్రమిస్తోందని వ్యాఖ్యానించారు. ఆక్రమణల నిర్మూలన కోసం తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థను కొందరు ఉద్దేశపూర్వకంగా భూతంలా చిత్రీకరిస్తున్నారని సీఎం విమర్శించారు. హైడ్రా ఎప్పుడూ చట్టబద్ధమైన ప్రైవేటు ఆస్తుల జోలికి వెళ్లలేదని, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులపై జరిగిన ఆక్రమణలను మాత్రమే తొలగించిందని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, భవిష్యత్తు తరాల అవసరాల దృష్ట్యా ఈ చర్యలు తప్పనిసరని పేర్కొన్నారు. ఆక్రమణదారులు ఎంతటి ప్రభావశీలులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు మూసీ నదిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడం ప్రభుత్వ సంకల్పమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్ని రాజకీయ, న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. మూసీ కాలుష్యం కారణంగా వేలాది మంది ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, నల్లగొండ జిల్లాలో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా

(మిగతా 2వ పేజీలో)

# డిజిటల్ బాటలో తెలంగాణ కేబినెట్..

- తెలంగాణలో పేపర్‌లెస్ కేబినెట్ సమావేశాల ప్రారంభం
- మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రభుత్వం
- పారదర్శకత, పాలనా సామర్థ్యం పెంచడమే లక్ష్యం
- వ్యవస్థ పనితీరును స్వయంగా పరిశీలించిన సీఎం రేవంత్



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో మరో కీలక ముందడుగు వేసింది. మంత్రివర్గ సమావేశాలను ఇకపై పూర్తిస్థాయిలో 'పేపర్‌లెస్' (కాగితరహితం)గా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'తెలంగాణ డిజిటల్ కేబినెట్' విధానాన్ని లాంఛనంగా ప్రారంభించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నూతన విధానానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా, కేబినెట్ సమావేశాలకు సంబంధించిన అజెండా, నోట్స్ మరియు ఇతర అధికారిక పత్రాలను ముద్రించిన ఫైళ్ల రూపంలో కాకుండా డిజిటల్‌గా ట్యాబ్‌ల ద్వారానే అందుబాటులో ఉంచుతారు. ఈ వ్యవస్థ పనితీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. పరిపాలనలో సామర్థ్యం, పారదర్శకత, సుస్థిరతను పెంపొందించడంతో పాటు కాగితం వాడకాన్ని తగ్గించడమే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశం. కాగా, ఈ సమావేశంలో కార్యదర్శులు లేదా ఇతర అధికారులు పాల్గొనలేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆగస్టు 2024లో ఈ-కేబినెట్ విధానాన్ని అమలు చేసిన దాదాపు రెండేళ్ల తర్వాత తెలంగాణ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

గతంలో 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో పేపర్‌లెస్ సమావేశాలు నిర్వహించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. అనంతరం మరింత ఆధునిక వెర్షన్‌తో ఆ విధానాన్ని అక్కడ పునఃప్రారంభించారు. జాతీయ సమాచార కేంద్రం సహకారంతో ఈ-గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ డిజిటల్ కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాధికార ప్రక్రియ మరింత వేగవంతం మరియు సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయం

- భారత మార్కెట్‌లో అపార అవకాశాలున్నాయని మోదీ పిలుపు
- ఫ్రాన్స్ కంపెనీలతో పెట్టుబడులు, విస్తరణపై చర్చలు
- నౌకాయానం నుంచి ఏఐ వరకు సహకారానికి కొత్త దిశ
- అందరికీ అందుబాటులో టెక్నాలజీ ఉండాలని ప్రధాని సూచన
- ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు భారత్ అనుకూల వేదికగా గుర్తింపు
- డిజిటల్ రంగంలో ప్రపంచానికి మార్గదర్శకంగా భారత్
- పారిస్‌లో మోదీకి ఘన స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు



పారిస్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా ఎదుగుతున్న శక్తిగా భారత్ నిలుస్తోందని, వ్యాపార విస్తరణకు మరియు పెట్టుబడులకు దేశంలో అపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో పర్యటిస్తున్న ఆయన అక్కడి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అగ్రశ్రేణి కంపెనీల ముఖ్య కార్యనిర్వహణాధికారులతో సమావేశమై భారత ఆర్థిక వ్యవస్థలోని అవకాశాలను వివరించారు. పెట్టుబడులు, సాంకేతిక సహకారం, పారిశ్రామిక విస్తరణ, భవిష్యత్ భాగస్వామ్యాలపై విస్తృతంగా చర్చించారు. భారత్--ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగిన ఈ సమావేశాలు

(మిగతా 2వ పేజీలో)




## నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
- బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
- పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి

(మిగతా 2వ పేజీలో)

## పీవీ జీవితం విద్యార్థులకు ఆదర్శం: కేటీఆర్

- జ్ఞానం, కృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపు
- స్వామి రామానందతీర్థ పాఠశాలలో విద్యార్థులతో మమేకం
- నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నేత
- మధ్యాహ్న భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తలసాని ట్రస్ట్
- విద్యతో పాటు పోషకాహారం కూడా అవసరమన్న నాయకులు
- పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్న హామీ



హైదరాబాద్ : బేగంపేట బ్రాహ్మణవాడలో ఉన్న స్వామి రామానందతీర్థ మెమోరియల్ స్కూల్ గురువారం విద్యార్థుల సందడితో కళకళలాడింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారికి నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేయడంతో పాటు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమైన మధ్యాహ్న భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులతో కలిసి సమయం గడుపుతూ వారి చదువులు, భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. చిన్నారులతో గడిపే

(మిగతా 2వ పేజీలో)

# అభివృద్ధిపై రాజీలేదు: సీఎం రేవంత్

మారాయని చెప్పారు. కాలుష్య ప్రభావం భవిష్యత్ తరాల ఆరోగ్యంపై పడకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య రహిత, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్‌లో సీఎం నాగలింగం మొక్కను నాటి వనమహోత్సవం--2026 కార్యక్రమాన్ని ప్రారంభించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు ఆయనతో కలిసి పాల్గొన్నారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించిన అనంతరం రూ.17.82 కోట్ల అంచనా వ్యయంతో 102 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఎకో అర్బన్ పార్కుకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వివిధ జిల్లాల్లో అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, పర్యావరణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై కూడా సీఎం తన దృష్టిని వివరించారు. దేశంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వరదలు, బెంగళూరులో మౌలిక వసతుల సమస్యలు తీవ్ర సవాళ్లుగా మారిన విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక వసతులతో కూడిన విశ్వనగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జూబ్లీహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు తరహాలో గుర్రంగూడలో 424 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. నగర ప్రజలకు మరింత పచ్చదనం, స్వచ్ఛమైన గాలి, వినోద సౌకర్యాలు అందించడంలో ఈ పార్కు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా అభివృద్ధిలో భాగంగా చూడాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 30 వేల ఎకరాల్లో ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని చెప్పారు. ఆధునిక పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన ఈ ప్రాజెక్టును అడ్డుకోవడం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనని విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలపై రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఎల్బీనగర్ ప్రాంత అభివృద్ధిపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. గతంలో నగర అభివృద్ధి ఒకే వైపుకు పరిమితమైందని, ఎల్బీనగర్, సైదాబాద్, సంతోష్‌నగర్, పాతబస్తీ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కోహెడలో అంతర్జాతీయ స్థాయి పండ్లు, పూల మార్కెట్‌ను



తీసుకొచ్చామని, ఎల్బీనగర్ ప్రజలకు ఆధునిక పార్కును అందించబోతున్నామని వెల్లడించారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన ఎల్బీనగర్ ప్రజల పట్ల ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు ఎంత చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గదన్నారు. పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. కొందరు తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాస్తవాలకు విరుద్ధమైన చిత్రాలు సృష్టించి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. నగరంలోని 42 నర్సరీల్లో నాలుగు కోట్ల మొక్కలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో భారీ ఎత్తున మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

# భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయం

రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చేలా కనిపిస్తున్నాయి. భారతదేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తయారీ రంగం, రవాణా వ్యవస్థ, నౌకాయానం, కృత్రిమ మేధ, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మోదీ సీఈఓలకు వివరించారు. ప్రపంచ పెట్టుబడిదారులకు భారత్ స్థిరమైన, విశ్వసనీయమైన, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా మారిందని పేర్కొన్నారు. దేశంలో అమలవుతున్న సంస్కరణలు, పారదర్శక విధానాలు, యువశక్తి, భారీ వినియోగదారుల మార్కెట్ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఫ్రాన్స్ సంస్థలు భారత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. సమావేశాల్లో నౌకాయానం, సరుకు రవాణా, రైల్వేలు, నిర్మాణ రంగం, పునరుత్పాదక ఇంధనం, కృత్రిమ మేధ వంటి వ్యూహాత్మక రంగాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. సీఎంఏ సంస్థ సీఓఓ రొడాల్ఫ్ సాదే మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న విస్తృత అవకాశాలపై ప్రధానమంత్రితో సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు. ఓడల నిర్మాణం, ఓడల రీసైక్లింగ్, లోతైన సముద్ర ఓడరేవుల అభివృద్ధి, కంటైనర్ తయారీ రంగాల్లో పరస్పర సహకారానికి మంచి అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారత్, ఫ్రాన్స్‌లు కలిసి పనిచేస్తే ప్రపంచ స్థాయిలో కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెయింట్ గోబైన్ సీఈఓ బెనాయిట్ బెజిన్, అల్‌స్టామ్ సీఈఓ మార్టిన్ సియోన్, మిస్ట్రాల్ ఏఐ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆర్థర్ మెన్స్ తదితర ప్రముఖులతో మోదీ సమావేశమయ్యారు. భారతదేశంలో జరుగుతున్న ఆర్థిక మార్పులు, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై వారు ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టే అంశంపై కూడా చర్చలు జరిగినట్లు తెలిసింది. పారిస్‌లో నిర్వహించిన వివాటెక్--2026 టెక్నాలజీ సదస్సులో మాట్లాడిన ప్రధాని మోదీ సాంకేతిక రంగంలో భారతదేశం అనుసరిస్తున్న విధానాలను వివరించారు. సాంకేతికత కొద్దిమందికే పరిమితం కాకుండా అందరికీ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. భారతదేశ దృష్టిలో కృత్రిమ మేధ అంటే సమాజంలోని ప్రతి వర్గాన్నీ కలుపుకుని ముందుకు తీసుకెళ్లే శక్తిగా భావిస్తామని చెప్పారు. టెక్నాలజీ ప్రజల జీవితాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉండాలని, సమాన అవకాశాలను కల్పించే సాధనంగా మారాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు కృత్రిమ మేధ వినియోగంపై పరిమితులు విధిస్తున్న తరుణంలో మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ప్రజాస్వామ్యీకరణ ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలు అందరికీ అందుబాటులోకి వచ్చినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుందని చెప్పారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఆర్థిక సేవలు, ప్రజా పరిపాలన వంటి రంగాల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తూ భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని వివరించారు. డిజిటల్ రంగంలో భారత్ సాధించిన పురోగతిని కూడా ప్రధాని ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో సగానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయని గుర్తుచేశారు. డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితం, టెలిమెడిసిన్, ఆన్‌లైన్ విద్య, వ్యవసాయ సేవలు వంటి రంగాల్లో సాంకేతికత ప్రజలకు చేరువైందని చెప్పారు. కోట్లాది మంది ప్రజల జీవితాల్లో డిజిటల్ పరివర్తన తీసుకొచ్చిన దేశంగా భారత్ నిలిచిందని పేర్కొన్నారు. భారత అభివృద్ధి నమూనాలో ప్రభుత్వం, పరిశ్రమలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ భాగస్వాముల పాత్ర కీలకమని మోదీ వివరించారు. ప్రభుత్వం అవసరమైన విధాన సహకారం అందిస్తుందని, పరిశ్రమలు ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తాయని, స్టార్టప్‌లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని చెప్పారు. అంతర్జాతీయ భాగస్వాములు కూడా ఈ ప్రయాణంలో భాగమై పరస్పర అభివృద్ధిని సాధించవచ్చని సూచించారు. గతంలో ఎన్నడూ లేనంత వేగంతో ప్రపంచం మారుతున్న ఈ సమయంలో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న అనంతరం పారిస్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. భారత జెండాలు, నినాదాలతో ఆయనకు స్వాగతం చెప్పిన ప్రవాసులు భారతదేశం పట్ల తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ, ప్రపంచ పురోగతిలో భారత్--ఫ్రాన్స్ భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. రెండు దేశాల మధ్య సాంస్కృతిక, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని, ఫ్రాన్స్‌ను మరింత దగ్గర చేయడంలో వారు చేస్తున్న కృషి గర్వకారణమని పేర్కొన్నారు.

# పీవీ జీవితం విద్యార్థులకు ఆదర్శం: కేటీఆర్

ప్రతి క్షణం తనకు అపారమైన ఆనందాన్ని కలిగిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జీవితాన్ని ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగి దేశ ప్రధానమంత్రి స్థాయికి చేరుకోవడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహానేతగా పీవీ నిలిచారని చెప్పారు. ఒకేసారి 16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం ఆయన అసాధారణ ప్రతిభకు నిదర్శనమన్నారు. జ్ఞానం, క్రమశిక్షణ, కఠోర శ్రమతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పీవీ జీవితం నిరూపించిందన్నారు. విద్యార్థులు కూడా ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్య, విజ్ఞానాన్ని ఆయుధంగా చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. చదువుతో పాటు శారీరక, మానసిక వికాసం సమానంగా అవసరమని చెప్పారు. విద్యార్థులకు సరైన పోషకాహారం అందితేనే వారి ప్రతిభ మరింత వెలుగులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఆ పథకం ఎంతగానో దోహదపడిందన్నారు. స్వామి రామానందతీర్థ మెమోరియల్ స్కూల్ విద్యార్థుల కోసం చేపడుతున్న



కార్యక్రమాలను ఆయన అభినందించారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆధునిక లైబ్రరీ ఏర్పాటు కోసం పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు కూడా విద్యారంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యా సేవలను విస్తరించడంలో, విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో తలసాని ట్రస్ట్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి సేవలను కూడా ప్రశంసించారు. విద్యారంగం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి సమాజం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చదువుకోవాలనే తపన ఉన్న పిల్లలకు అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా వందలాది మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్యతో పాటు సమతుల్య పోషకాహారం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం బాగుంటేనే వారు చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని చెప్పారు. పోషకాహారం వారి శారీరక ఎదుగుదలతో పాటు మేధో వికాసానికి కూడా దోహదపడుతుందని వివరించారు. విద్యార్థుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాఠశాల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమం మొత్తం విద్యార్థుల సందడి, నాయకుల ప్రోత్సాహక సందేశాలతో ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థులతో కలిసి భోజనం వడ్డిస్తూ, వారితో ముచ్చటిస్తూ గడిపిన కేటీఆర్ సందర్శన చిన్నారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. విద్య ద్వారా సమాజాన్ని మార్చాలనే సంకల్పంతో ముందుకు సాగాలని నాయకులు ఇచ్చిన సందేశం విద్యార్థులను ఆకట్టుకుంది.



## సికింద్రాబాద్ జోన్‌లో పర్యటించిన రీజియన్ ఈడీ సామ్రాట్ అశోక్

### పైప్‌లైన్ లీకేజీలు, సీవరేజ్ ఓవర్‌ఫ్లో ప్రాంతాల పరిశీలన

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 18: జలమండలి హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామ్రాట్ అశోక్ గురువారం సికింద్రాబాద్ జోన్ పరిధిలోని తార్నాక సర్కిల్‌లో పర్యటించి ప్రధాన పైప్‌లైన్ లీకేజీలు, సీవరేజ్ ఓవర్‌ఫ్లో ప్రాంతాలు, ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లు, రిజర్వాయర్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తార్నాక ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్‌లో మిగులు క్లోరిన్ స్థాయిని తనిఖీ చేసిన ఆయన, ఎంసీసీ ద్వారా కేటాయించిన ట్యాంకర్ ట్రిప్పులను అదే రోజు పూర్తిచేసి వినియోగదారులకు సకాలంలో నీటి సరఫరా అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రిజర్వాయర్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు వెంటిలేటర్లకు రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తదుపరి తార్నాక మెట్రో స్టేషన్, లాలాపేట్ ఫ్లైఓవర్, హబ్సిగూడ సిగ్నల్, తార్నాక ఎక్స్ రోడ్స్ ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలు, సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యలను పరిశీలించిన సామ్రాట్ అశోక్, సమస్యలను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లీకేజీలు, సీవరేజ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ పర్యటనలో జనరల్ మేనేజర్ వినోద్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## లాలాపేట్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 18: లాలాపేట్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో బీఆర్ఎస్ నాయకుడు కూరెల్లి నాగరాజ్ గౌడ్ ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితా సవరణ, నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. స్థానిక ప్రజలు కూడా కార్యక్రమానికి సహకరిస్తూ తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.ఓటరు జాబితా పటిష్టతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముధిరాజ్, మల్లికార్జున్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## 24 వరకు తెలంగాణలో వడగాల్పులు..

### ఆ వెంటనే భారీ వర్షాలు కురిసే అవకాశం!

తీవ్రమైన ఎండలు, వడగాల్పులతో అల్లాడిపోతున్న తెలంగాణ, పొరుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉపశమనం కలిగించే చల్లని కబురు అందించింది. వచ్చే నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణతో పాటు ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో కొంతకాలంగా పొడి వాతావరణం, తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, రుతుపవనాల రాకతో వచ్చే వారం నుంచి వర్షాలు ఊపందుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన బలమైన ఎల్ నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాల గమనం సాధారణం కంటే చాలా నెమ్మదిగా సాగుతోంది. దీనివల్ల దేశవ్యాప్తంగా వర్షాలు ఆలస్యం కావడమే కాకుండా, అనేక రాష్ట్రాల్లో వర్షపాత లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఐఎండీ నివేదికల ప్రకారం దేశంలోని 741 జిల్లాల్లో 239 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా, మరో 230 జిల్లాల్లో అత్యంత తీవ్రమైన వర్షపాత లోటు ఏర్పడింది. ఈ జాప్యం ఖరీఫ్ సీజన్ సాగుపై, తాగునీటి వనరులపై తీవ్ర ప్రభావం చూపుతుండటంతో అటు వ్యవసాయ రంగం, ఇటు ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణలో రుతుపవనాలు విస్తరిస్తాయని చెబుతున్నప్పటికీ.. జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణతో పాటు ఉత్తరప్రదేశ్, విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో కూడా ఈ ఎండల తీవ్రత కొనసాగనుంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ రుతుపవనాల సీజన్ మొత్తంలో దక్షిణాది రాష్ట్రాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తన దీర్ఘకాలిక అంచనాల్లో ఇప్పటికే స్పష్టం చేసింది.



## హన్విక ఫ్లవర్ డెకరేటర్స్' దుకాణాన్ని ప్రారంభించిన దేప భాస్కర్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : జూన్18 :- రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట నాగోల్ రోడ్‌లోని బండి సందీప్ నూతనంగా ఏర్పాటు చేసిన లిహన్విక ఫ్లవర్ డెకరేటర్స్ దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా, సరికొత్త డిజైన్లు మరియు ఉత్తమ సేవలతో ఈ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు.స్వయం ఉపాధితో పాటు నలుగురికి ఉపాధి కల్పించేలా వ్యాపార రంగంలో అడుగుపెట్టిన యువ నిర్వాహకులు సందీప్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వ్యాపారంలో వారు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, రాజు నాయక్, పందుల వెంకటేష్ గౌడ్, షఫీ, సుదర్శన్, రమేష్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

## సంస్థాన్ లో శ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన హాజరైన ముదిరాజ్ సంఘం నాయకులు- గ్రామ ప్రజలు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి ఆలయం లో ఆలయ చైర్మన్ గట్టు గోపాల్ మాజీ అధ్యక్షులు నిమ్మల నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో దైవిక శక్తిని ప్రసరింపజేసేందుకు ధ్వజస్తంభ ప్రతిష్టాపన అత్యంత పవిత్రమైన కార్యాన్ని వేద పండితులు, అర్చకులు, ప్రత్యేక పూజలు, హోమాలు మరియు ఆగము శాస్త్ర నియమాల ప్రకారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఉప్పరగొని యాదయ్య, మాజీ అధ్యక్షులు నిమ్మల నగేష్ ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ గట్టు గోపాల్ మాజీ ఉపాధ్యక్షులు ఉప్పరగొని యాదయ్య పూలమోని వెంకటేష్, ఉప్పర గోని రమేష్, చింతల సత్తయ్య ముదిరాజ్, గ్రామ ప్రజలు ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు



## రోషన్ దౌలాలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్18 :- బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలోని మీర్పేట్ రోషన్ దౌలాలో జరుగుతున్న అక్రమ ఇంటి నిర్మాణాలపై శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ ని కలిసి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ భారతీయ జనతా యువ మోర్చా కార్యదర్శి సతీష్ నందలివిజ్ఞప్తి చేయడం జరిగింది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను అరికట్టి, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరాం.ఈ కార్యక్రమంలో బోదసు యాదగిరి, మంద సునీల్, జెడి ప్రశాంత్, రవి, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల ధరలు తగ్గించాలి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 18భారీగా పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే సబ్సిడీలకు కోతవిదించి ఎరువుల ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న కేంద్ర పాలకులకు వ్యతిరేకంగా రైతులు సమీకృతులై ఎరువుల ధరలు తగ్గించే వరకు పోరాడాలని పశ్యపద్మ పిలుపునిచ్చారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో రైతులు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలు లేక నాటిన పత్తి విత్తనం మొలకెత్తుతదా లేదా అని రైతులు దిగులు పడుతున్నారని తెలిపారు. వ్యవసాయ అధికారులు ఎక్కడికక్కడ గ్రామ స్థాయిలో ఎల్ నినో ప్రమాదాన్ని రైతులకు విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా చైతన్యవంతం చేయాలని డిమాండ్ చేశారు.

## సాయిబాబా దేవాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 18

ఆలయాలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాధన చేపట్టడం తమ పూర్వజన్మ సుకృతమని సుశీల సోషల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పెద్దిటి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం చౌటుప్పల్ కు చెందిన సుశీల సోషల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పెద్దిటి కృష్ణారెడ్డి సతీమణి పెద్దిటి సుశీల దేవి వర్ధంతి సందర్భంగా తొలిసారి ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలోని శ్రీ సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో అభాగ్యులకు, ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు చేయితనందించేందుకు నిరంతరం పాటు పడతామన్నారు. చౌటుప్పల్ కేంద్రంగా తాము రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, కుటుంబ సభ్యులు గుమ్మి నర్సింహా రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పల్లె దయాకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# 174, 175,176, సర్వే నెంబర్ల భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్ లను రద్దు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలి

### భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 200 మీటర్ల పొడవుతో కల్వర్టు నిర్మించాలి...

### రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్,





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 18

చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ రోడ్డులోని సర్వే నెంబర్ 174,175,176 లో ప్రవహిస్తున్న మొండికుంట కాలువ ఆక్రమణ గురి కావడం జరిగింది.చౌటుప్పల్ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణ జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించడం జరిగింది. స్థానిక ఆర్డిఓ ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, మాట్లాడుతూ గత 2020 సంవత్సరంలో మొండికుంట కాలువ స్థలం ఆక్రమణ గురించి అప్పటి కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి, జిల్లా కలెక్టర్ గార్లకు విన్నపించగా వారు 35 మీటర్ ల పొడవుతో కల్వర్టు నిర్మాణం 100 ఫీట్ ల వెడల్పు తో మొండికుంట కాలువ నిర్మాణం జరుగుతుంది అని చెప్పి మొండికుంట కాలువ స్థలం ను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగింది. కానీ అదే చోట ఇప్పుడు మళ్లీ కనీసం 20 మీటర్ ల పొడవు కూడా లేకుండా కల్వర్టు ను పునర్నిర్మానం చేయడం జరుగుతుంది. చౌటుప్పల్ పట్టణంలోని 80% కు పైగా మురుగునీరు మరియు వర్షపు నీరు వలిగొండ రోడ్ లోని మొండికుంట కాలువ గుండా ప్రవహిస్తుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 200 మీటర్ల పొడవుతో కల్వర్టు పూర్వపు యధాస్థితి ఉండేలా నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగింది.174, 175,176, సర్వే నెంబర్ల భూమిలో పరిమితిని మించి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లను రద్దు చేసి అక్కడ జరిగిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని అలాగే సర్వే నిర్వహించి సరిహద్దుల ను గుర్తించాలని కోరడం జరిగింది..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రామనగోని శంకర్,పెద్దకొండూరు మాజీ సర్పంచ్ కాయితీ రమేష్ గౌడ్, మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు వంగాల రామాకాంత్ గౌడ్, వరగంటి భాను, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి దిండు భాస్కర్ గౌడ్,బీజేవైఎం మండల అధ్యక్షులు పబ్బు వంశీ, మండల బీజేపీ ప్రధానకార్యదర్శి పబ్బతి శేఖర్, బాతరాజు ప్రవీణ్, పర్నె శ్రీనివాస్ రెడ్డి, కుంభ బాబు, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారాయి స్వాధీనం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 18జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్, రాజనగర్ తండా, ఒడ్డెలింగాపూర్, రాయికల్ ఒడ్డెర కాలనీ లలో గురువారం రోజున నాటుసారాయి దాడులు నిర్వహించి నాటుసారాయి విక్రయిస్తున్న శ్రీరాముల యమున అల్లీపూర్ గ్రామం నుండి 2 లీటర్ల నాటుసారాయి ని స్వాధీనం చేసుకోని ఆమె పై కేసు నమోదు చేయునైనది. తదుపరి గతంలో నాటుసారాయి అమ్మిన, అనుమానస్పదం ఉన్న (5) వ్యక్తులను రాయికల్ తహసీల్దార్ ముందు బైండోవర్ చేయునైనది అని జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్ మండలంలో ఎవరైనా గుడుంబాను అమ్మిన సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదే విధంగా గుడుంబా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు బెల్లం, పట్టిక విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినారు. ఇట్టి దాడుల్లో ఎస్సై స్వప్న, ట్రైనీ ఎస్ ఐ హారిక, సిబ్బంది బండి నారాయణ, మహేందర్, వెంకటేష్, సంయుక్త లు పాల్గొన్నారు.

# ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో దోపిడీని అరికట్టాలి

### మల్యాల రాకేష్ ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 18

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ జగిత్యాల ఆధ్వర్యంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డిఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తూ పేద, బడుగు, బలహీన విద్యార్థులను అన్యాయానికి గురి చేస్తుంది. అంతేకాకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ఎంఈఓ, డిఈఓలు లేని కారణంగా ఉన్న ఇన్చార్జి డిఈఓ లు కనీసం పట్టించుకోకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలకడం చాలా బాధాకరమని అన్నారు. పాఠ్యపుస్తకాలను పాఠశాలలో అమ్ముతూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్నప్పటికీ అధికారులు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే మొద్దు నిద్ర వహిస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంఈఓ, డిఈఓ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నందువల్ల ఎంతో మంది విద్యార్థులు అన్యాయానికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తుందని తెలిపారు. నిర్ణయాలను వెనక్కి తీసుకొని ప్రభుత్వ పాఠశాలలను, సాంఘిక సంక్షేమ హాస్టల్ లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి హాస్టల్లకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు. అలాగే ఎన్ఈపి 2020 తక్షణమే అమలు చేయాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుని వాటి గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్, నగర కార్యదర్శి రాపాక నిఖిల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, మారుతి, కార్యకర్తలు ప్రణీత్, అజయ్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేట్ స్కూల్ లకు ధీటుగా అంగన్వాడి స్కూల్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 18 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డెర కాలనీ (శివాజీ నగర్) అంగన్వాడి కేంద్రంలో గురువారం రోజున అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జగిత్యాల ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి మాట్లాడుతూ రెండు సంవత్సరాల ఆరు నెలలు నిండిన ప్రతి ఒక్క పిల్లలని అంగన్వాడి కేంద్రానికి పంపాలని, కార్పోరేట్ స్కూల్ లకు ధీటుగా అంగన్వాడి పని చేస్తుందని, మంచి వాతావరణంలో వారికి అనువైన పద్ధతిలో ఆటపాటలతో సృజనాత్మకతలతో పిల్లలకి విద్యను బోధిస్తూ ఆటలలో, పాటలలో, జనరల్ నాలెడ్జిలో పిల్లలను ముందు స్థానంలో ఉంచుతుందని ఆమె అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ బోదాసు రాజేష్, వార్డు సభ్యులు మాధురి మురళి, కార్యదర్శి అమీర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, టీచర్ నవ్యశ్రీ, అంగన్వాడి టీచర్ బియ్యని సుజాత, ఆయమ్మ లక్ష్మి, పిల్లల తల్లులు సంధ్య, లక్ష్మీ, లతిక, శ్రీలత, నవ్య , శైలజ, పూజ , రాజశ్రీ, వెంకమ్మ ,అనూష తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న తుర్కపల్లి పోలీసులు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధియాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్న నేపథ్యంలో, తుర్కపల్లి పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు 18-06-2026 రోజున తుర్కపల్లి పరిధిలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు ఆలేర్ పరిసర ప్రాంతాల నుండి పీడీఎస్ బియ్యాన్ని సేకరించి గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైంది.పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సుమారు 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.నిందితుల వివరాలు:కేతవత్ ప్రభాస్, తండ్రి శ్రీను, వయస్సు 20 సంవత్సరాలు, వృత్తి: డ్రైవర్, నివాసం: కంధిగడ్డ తండా, ఆలేర్ మండలం.బానోత్ శివ, తండ్రి లచ్చీరామ్, వయస్సు 20 సంవత్సరాలు, వృత్తి: డ్రైవర్, నివాసం: కంధిగడ్డ తండా, ఆలేర్ మండలం.స్వాధీనం చేసుకున్న వస్తువులు:ఒక డీసీఎం వాహనం100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, కొనుగోలు చేయడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి అక్రమ రవాణా లేదా నిల్వల గురించి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కేసు జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్, డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ గారి పర్యవేక్షణలో, తుర్కపల్లి ఎస్ఐ మహమ్మద్ తఖియుద్దీన్ మరియు సిబ్బంది ఛేదించారు



## పర్మిషన్ లేని విద్య సంస్థలను మూసివేయాలి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 18

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని టిఆర్ఎస్వి సంఘం గంగాదేవి శివ అన్నారు. తనంతరం ఎంఈఓ ను కలిసి వినతి పత్రం అందజేశారు. టిఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ విద్యా హక్కుల చట్టాన్ని అమలు చేయాలని పర్మిషన్ లేని విద్య సంస్థలను మూసివేయాలని ప్రవేట్ పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం అరికట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి నాయకులు గంగాదేవి శివ, చౌటుప్పల్ మున్సిపల్. నాయకులు ఊదరి రాకేష్,ఎండీ అతు,ఎండీ జున్ను..



## అంగన్వాడీ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 18

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని ఇటిక్యాల గ్రామంలోని 4వ అంగన్వాడి కేంద్రంలో గురువారం రోజున అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాల పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు అనురాధ, సుజాత, సహేరా, బుజ్జమ్మ, కవిత, రమ్య,తల్లులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాజానగర్ లంబాడి తండాలో బడిబాట

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 18

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రాజనగర్ లంబాడీ తండా స్కూల్ లో బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతపు రాజేష్, ఉప సర్పంచ్ గుగ్లోతు శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, అంగన్వాడీ టీచర్ ప్రమీల, ఉపాధ్యాయులు గంగాధర్, వార్డు సభ్యులు రవి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ అవగాహన సదస్సు

### - కేటీఆర్ కార్యక్రమ విజయానికి కార్యాచరణ రూపొందించిన గులాబీ నాయకత్వం



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్18 :- మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రకారంగా నిర్వహించనున్న అవగాహన సదస్సు కార్యక్రమానికి సంబంధించి ముఖ్య నాయకుల సమావేశంగురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ఈనెల 27వ తేదీన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ముఖ్య నాయకులకు దశ దిశను నిర్దేశించారు.అలాగే ఎస్ఐఆర్ ప్రకారంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, బీఎల్ఏల కార్యచరణ, సభ నిర్వహణ, ప్రజల సమీకరణ, బాధ్యతల పంపిణీ మరియు సమన్వయంపై నాయకులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమ వేదికగా సమయాది రెడ్డి గార్డెన్ వద్ద నిర్వహించనున్న సభ ఏర్పాట్లపై కూడా సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పట్లోళ్ల యువకిశోరం కౌశిక్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాలాపూర్ బొడ్రాయి దేవత ఉత్సవాలకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్18 :- మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ 62వ డివిజన్లో బాలాపూర్ గ్రామంలో ఈనెల 25వ తేదీ నుండి ప్రారంభమవుతున్న శ్రీ బొడ్రాయి దేవత ఉత్సవాల సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు ఈ సందర్భంగా నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, చిగురింత పెద్ద నరసింహారెడ్డి ,జూకంటి సురేష్ గౌడ్, మున్నా, అరవింద్ గౌడ్, పాండు, విజయ్, శ్రీనివాస్ యాదవ్, సాంబశివ, కుమార్ గౌడ్, తదితరులు పాల్గొని ఉత్సవాలకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ని ఆహ్వానించారు.ఈ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మంత్రాల చెరువు దుస్థితిపై బిజెపి ఆందోళన

### అభివృద్ధి అంటే సబితమ్మ.. సబితమ్మ అంటే అభివృద్ధి" అంటున్న వారికి బీజేపీ నేతల ప్రశ్నలు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్18 :- మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ సర్కిల్-60 డివిజన్ పరిధిలో ఉన్న మంత్రాల చెరువు అభివృద్ధి పనులపై బీజేపీ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల నిధులతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారని, ఆ పనులకు అప్పటి బిఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు కి కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపించారు. ఆ పనులు నాణ్యత లేకుండా జరిగాయని, ప్రస్తుతం చెరువులో గుర్రపుడెక్క విస్తరించి వాకర్లకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలు ఉన్న ప్రాంతాలను సందర్శించి పరిష్కార చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, కేవలం కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు.అభివృద్ధి అంటే సబితమ్మ.. సబితమ్మ అంటే అభివృద్ధి" అని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులకు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మంత్రాల చెరువు పరిస్థితిని చూసి కూడా అభివృద్ధి జరిగిందని ఎలా చెప్పగలరని నిలదీశారు.అలాగే, టీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అరికల కామేష్ రెడ్డి ఇటీవల చెరువు వద్దకు వెళ్లి అభివృద్ధి జరగలేదంటూ ధర్నాలు



చేయడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. ముందుగా తన హయాంలో చేపట్టిన చెరువు అభివృద్ధి పనుల నాణ్యతపై సమాధానం చెప్పాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని విజయలక్ష్మి రాజు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మీర్పేట్ అధ్యక్షుడు తులసి ముఖేష్, జనరల్ సెక్రెటరీ సిద్దాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు, జగన్ ముదిరాజ్, ప్రభాకర్, కసిరాం, మల్లికార్జున్,దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



## చంచల్గూడా జైలులో బాల్క సుమన్ ను పరామర్శించిన సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్18 :- కాంగ్రెస్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులో అరెస్టై జైలు లో ఉన్న మాజీ శాసనసభ్యులు .బాల్క సుమన్ ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి కలవడం జరిగింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన ఆ ప్రాంత ప్రజల కొరకు ఆ ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేయటం ఈ కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని తెలిపారు. మీరు ఎన్ని అక్రమ కేసులు పెట్టి అణిచివేయాలని చూసినా ప్రశ్నించడం ఆగదని తెలిపారు.. అదేవిధంగా మీరు చేస్తున్న కుంభకోణాలన్ని బయటపెడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు . అర్కల కామేష్ రెడ్డి సీనియర్ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి బిఆర్ఎస్వి నాయకులు .రమన్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు

### లాలాపేట్ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి..మున్సిపల్ జోనల్ కమిషనర్కు వినతిపత్రం అందజేసిన మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ యాదవ్




సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 18: లాలాపేట్ డివిజన్లో గత కొన్ని నెలలుగా, సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ యాదవ్ కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ మున్సిపల్ జోనల్ కమిషనర్ మంగతాయారుకు గురువారం వినతిపత్రం అందజేశారు. డివిజన్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో కూడికతీత పనులు, ఇతర ముందస్తు చర్యలను చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా కిషోర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే పెండింగ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.




## ఎంపీపీఎస్ విద్యార్థులకు జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 18 : విద్యార్థుల విద్యావసరాలకు తోడ్పాటునందించే ఉద్దేశంతో జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదువుతున్న 100 మంది విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బ్యాగులో గొడుగు, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్, పెన్సిల్ బాక్స్ తదితర సామగ్రిని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. విజయ్ కుమార్, జెడ్పీహెచ్ఎస్ హాబ్సిగూడ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఉపేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా నిలుస్తూ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సుజాత, ఎ. కల్యాణి, చి. అనిత, కె. శ్రీదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన బ్యాగుల పంపిణీ పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## విద్యారంగ సమస్యలపై సమరానికి సిద్ధం

### ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

### ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: మందకృష్ణ మాదిగ



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 18: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం హబ్సిగూడలోని కినారా గ్రాండ్ హోటల్లో నిర్వహించిన వివిధ విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి సంబంధించి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్పై ఆధారపడి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యార్థులే ఫీజులు చెల్లించుకోవాలనే నిబంధనను రద్దు చేసి, ప్రభుత్వమే కళాశాలలకు నేరుగా ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. గురుకుల విద్యాలయాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల పరిస్థితి దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించకుండా ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు సంబంధిత శాఖల మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ముందుకు వస్తే ఐక్యంగా పోరాటం నిర్వహిస్తామని పేర్కొన్నారు.సమావేశానికి ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ స్వాగతోపన్యాసం చేశారు. ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సోమశేఖర్ మాదిగ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్తో పాటు వివిధ దళిత, బహుజన, ఆదివాసి, వామపక్ష, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొని విద్యారంగ సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలని అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి: బోరెల్లి సురేష్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 18: ఈ నెల 21న హైదరాబాద్లోని ఇందిరా పార్క్లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోరెల్లి సురేష్ మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో చేపడుతున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ఇప్పటికీ తగిన గుర్తింపు లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నెల 21న సాయంత్రం 4 గంటల నుంచి ఇందిరా పార్క్లో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యమకారులు వేలాదిగా పాల్గొని తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో డాక్టర్ పిడమర్తి రవి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మొగిలిగిద్ద ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం సైఫాబాద్ సైన్స్ కళాశాల అధ్యక్షుడు గణేష్, బీఎస్ఎఫ్ ఓయూ ఉపాధ్యక్షుడు ఆరెకంటి శ్రీకాంత్తో పాటు శ్రీనివాస్, సందీప్, రాజేందర్, ఓంకార్, ప్రసిద్ధి కృష్ణ, రాజు ముదిరాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి వేడుకలు



వార్తమిర్రర్, మందమర్రి, జూన్ 18: భారత దేశ ప్రథమ స్వాతంత్ర్య సమర యోధురాలు రాణి ఝాన్సీలక్ష్మీబాయి168వ వర్ధంతి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో గురువారం రిటైర్డ్ ఆర్మీ జవాన్, ప్రస్తుత సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్ హాల్,రాణి పివ్ హాల్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాణి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి 1828 వారణాసిలో జన్మించిన ఆమె భారత స్వాతంత్ర పోరాటంలో ముఖ్యమైన నాయకురాలని,చిన్నతనం నుంచి గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం నేర్చుకుని 1857 బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన భారత తిరుగుబాటులో ఆమె కీలక పాత్ర పోషించి ఆమె ధైర్యానికి దేశభక్తికి ప్రతికగా నిలిచారన్నారు. ఝాన్సీ రాణి చిన్నతనం నుండి దేశ స్వాతంత్రం కోసం పోరాడి 1858 జూన్లో వీరమరణం పొందారాన్నారు. భారత దేశ చరిత్రలో ఒక వీరవనితగా స్వాతంత్ర సమరయోధురాలిగా గౌరవించబడిందని ఆమె ధైర్యం దృడసంకల్పం న ప్రేరణగా నిలుస్తాయని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి దేశభక్తిని పెంపొందించుకోవడంతో పాటు స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. రాజేష్ పివ్ హాల్ మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో పాఠశాలలో స్వతంత్ర సమరయోధులు, మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.